క్లుప్తంగా

ఆటోను లారీ ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

దామెర : ప్యాసింజర్ ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని ఓగ్లాపూర్ గ్రామ సమీపంలోని హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఊరుగొండ గ్రామానికి చెందిన ముత్యాల వెంకటాచలం అదే గ్రామానికి చెందిన జన్ను శ్రీనివాస్ ఆటోలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వరంగల్‌లోని కూరగాయల మార్కెట్‌కు ఆదివారం తెల్లవారుజామున బయల్దేరారు. అలాగే మండలంలోని ఓగ్లాపూర్ వద్ద సయ్యద్ కౌషల్ అనే మహిళ కూరగాయల మార్కెట్‌కు వెళ్లేందుకు శ్రీనివాస్ ఆటో ఎక్కింది. ఈ క్రమంలో ఓగ్లాపూర్ శివారులోని ఎస్సారెస్పీ కాలువ వద్దకు రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న లారీ ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సయ్యద్ కౌషల్‌కు ఎడమ కాలు విరిగిపోగా ఆటో డ్రైవర్ శ్రీనివాస్ తలకు, వెంకటాచలం భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు చికిత్స కోసం 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆటోడ్రైవర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటి చెట్టు నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు



ఐనవోలు : గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు చిర్ర రవి కుల వృత్తిలో భాగంగా ఆదివారం కల్లు తీయడానికి తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. ఈ క్రమంలో రవి రెండు కాళ్లు విరిగిపోగా వెన్నుముకకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం రవిని ఆస్పత్రికి తరలించారు.

బీఆర్‌ఎస్ పార్టీ గ్రామశాఖ ఎన్నిక



కమలాపూర్ : మండలంలోని నేరెళ్ల బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోల్కొండ నాగరాజు, ఉపాధ్యక్షులుగా దద్దు కుమార్‌యాదవ్, నాయకం రఘుపతి, ప్రధాన కార్యదర్శిగా బేతి శ్రీనివాస్, కోశాధికారిగా కోడపాక శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అలాగే అనుబంధ శాఖల కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంగల తిరుపతమ్మ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకుడు శివరాత్రి తిరుపతి, బీఆర్‌ఎస్వీ నాయకుడు జెట్టి పవన్ పాల్గొన్నారు.

కౌన్సిలర్ చేయూత



పరకాల : పట్టణానికి చెందిన పురాణం వెంకటేష్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి చేయూత అందించారు. తన వంతుగా 50 కిలోల సన్నంబియ్యంతోపాటు నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మోతె రాజయ్య, మారెమ్మ, పురాణం కుమార్, లక్ష్మీ, సిరిగిరి శేఖర్, మోతె రాజు, మోతె ఎల్లస్వామి, కొండపల్లి రాజు, మార్క నాగరాజు, సంఘం పురుషోత్తం, సాయి చందు, రంజిత్, సూర్యప్రకాశ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

హన్మకొండ: చెరువు శిఖంలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు టి.ఉప్పలయ్య కోరారు. ఈ మేరకు చెరువు శిఖం, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు జీఓ నంబర్ 58 ప్రకారం ఇళ్ల పట్టాలివ్వాలని సీఎం కేసీఆర్‌ను ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించిన క్రమంలో హనుమకొండలోని గోపాల్‌పూర్‌లో గుడిసెవాసులు చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌కు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పేదలు నివాస స్థలాలు లేక చెరువు శిఖం భూమిలో గుడిసెలు వేసుకుని కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వాంకుడోత్ వీరన్న, వల్లపు లింగమూర్తి, వల్లెపు రాజు, ఎస్.రాజేష్, చెట్లపల్లి లక్ష్మీ, మురళి, సుజాత పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

● ఘనంగా నివాళ్లు

కమలాపూర్ : భారతదేశానికి ప్రధానిగా రాజీవ్‌గాంధీ అందించిన సేవలు మరువలేనివని బ్లాక్ కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు దేశిని ఐలయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ తౌటం రవీందర్ కొనియాడారు. మండలంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఆదివారం వేడుకగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐలయ్య, రవీందర్ మాట్లాడారు. రాజీవ్‌గాంధీ దేశానికి, యువతకు, ఐటీ రంగానికి చేసిన సేవలను గుర్తు చేశారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు రిక్కల నారాయణరెడ్డి, పోతిరెడ్డి ఓదెలు, బాలపురి కనకరత్నం, మనీష్, హనుమాన్ ప్రసాద్, అనిల్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్ గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. టెక్నాలజీని భారతదేశానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తిగా కీర్తించారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ కార్యదర్శి మార్నేని వెంకటేశ్వర్‌రావు, నాయకులు రూపిరెడ్డి సాయిరెడ్డి, చిరంజీవిరెడ్డి, సునీల్, రహీం పాషా, ఎలిషా, బాబు, సంపత్, రాకేశ్‌రెడ్డి, మీర్ మహ్మద్, సారయ్య, సాయిబాబా, రాములు, వెంకన్న, అశోక్, ప్రతాప్, రాజ్‌కుమార్‌పాల్గొన్నారు.



కమలాపూర్ : రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐలయ్య, తదితరులు



ఐనవోలులో..



ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి మైపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామ శాఖ అధ్యక్షుడు బయ్యరాజు, ప్రధాన కార్యదర్శి అలువాల రవి, మత్స్య శాఖ చైర్మన్ బయ్య తిరుపతి, ప్రధాన కార్యదర్శి తనుగుల సందీప్, సొసైటీ డైరెక్టర్స్ శ్రీను, బూర రాజేందర్, వార్డు మెంబర్ కాడబోయిన రవియాదవ్, జిల్లా బీసీ కోఆర్డినేటర్ చిమ్మని దేవరాజ్, నాయకులు పర్వతగిరి రాజు, జిన్నా వెంకన్న, ఉప్పుల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుపరిపాలన

● మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : కాంగ్రెస్‌తోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని ఆ పార్టీ నేత, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని కొప్పూర్ గ్రామంలోని పంచముఖ హనుమాన్ ఆలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం ప్రవీణ్‌రెడ్డి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలను విస్మరించి ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, ఇతర అన్ని నిత్యావసర సరుకుల ధరలను భారీగా పెంచి పేద, మధ్యతరగతి కుటుంబాలపై పెనుభారం మోపిందని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.450 ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.1200లకు పెరిగిందని తెలిపారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ కారణంగా 23 కోట్ల మంది పేదరికంలోకి నెట్టబడ్డారని తెలిపారు. మూడు రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చి 750 మంది రైతులను పొట్టనబెట్టుకున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేస్తామని చెప్పి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ఏ ఒక్కరికీ గుంట భూమి కూడా ఇచ్చిన దాఖలాల్లేవని ధ్వజమెత్తారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, తదితర హామీలను విస్మరించిందన్నారు. కర్నాటక తరహాలో తెలంగాణలోనే కాంగ్రెస్ విజయభేరి మోగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సరోజన, మహిళా అధ్యక్షురాలు స్వరూప, నాయకులు లక్ష్మారెడ్డి, అశోక్, ఐలయ్య, ఆదారి రవీందర్, శంకర్, సమ్మయ్య, భీంరెడ్డి, కనకయ్య పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

'అమరవీరుల జిల్లా' సాధనకు పోరాటాలు

● కన్వీనర్‌గా దుబాసి వెంకటస్వామి ఎన్నిక



పరకాల : పరకాలను అమర వీరుల జిల్లాగా ఏర్పాటు చేసేలా పోరాటాలు నిర్మించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆకాంక్షించారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో సాధన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా దుబాసి వెంకటస్వామి, సభ్యులుగా కొలనుపాక భద్రయ్య, బాసాని సోమరాజ్, కక్కు రాజు ఎన్నికయ్యారు. అనంతరం భిక్షపతి మాట్లాడారు. పాలకులపై ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణతో ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, హుస్నాబాద్ పాలక్ డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్, నడికూడ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి, కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి, నాయకులు రంజిత్, భాస్కరాచారి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

తరుగు తీస్తే చర్యలు తప్పవు

నడికూడ : కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యం నుంచి తరుగు తీస్తే చర్యలు తప్పవని సీఐ కిషన్ తెలిపారు. మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. కొనుగోళ్లు, ఇతరత్రా అంశాలపై రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. ధాన్యం నుంచి తరుగు తీస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్ సమస్యను త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్సై ప్రశాంత్‌బాబు, సర్పంచ్ ఊర రవీందర్‌రావు తదితరులున్నారు.

ధాన్యం అన్‌లోడింగ్ చేయాలని ధర్నా

● ఎస్సై జోక్యంతో ఆందోళన విరమణ

శాయంపేట : కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసి పంపిన ధాన్యాన్ని మిల్లర్లు దిగుమతి చేసుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పరకాల-హనుమకొండ ప్రధాన రహదారిపై రైతులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు జోక్యం చేసుకోవడంతో రైతులు ఆందోళన విరమించారు. వివరాలిలా.. శాయంపేట, పరకాల, నడికూడ మండలాల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసి ధాన్యాన్ని మండలంలోని శ్రీనివాస రైస్ మిల్లులో దిగుమతి చేయడానికి రైతులు ట్రాక్టర్లు, డీసీఎంలు, టాటా ఏసీ వాహనాల్లో తీసుకొచ్చారు. హమాలీలు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే దిగుమతి చేస్తుండడంతో తీవ్ర జాప్యం జరుగుతూ గంటల తరబడి రోడ్డుపైనే ధాన్యం వాహనాలు నిలిచిపోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో రైతులపై వాహనాల ఛార్జీ భారం పడుతోంది. దీంతో అసహనానికి గురైన రైతన్నలు ఆదివారం మిల్లు ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోకుండా మిల్లు యాజమాన్యం మోసపూరితంగా వ్యవహరిస్తూ తమను ఆర్థికంగా దెబ్బతీస్తోందని వాపోయారు. వర్షాలు కురిస్తే ధాన్యం పరిస్థితి ఏంటని ఆందోళన వెలిబుచ్చారు. దీంతో విషయం తెలిసి ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. రైస్ మిల్లు యాజమాన్యంతో మాట్లాడి ధాన్యం బస్తాలను వెంటనే దిగుమతి చేసుకోవాలని చెప్పారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం బస్తాలు దిగుమతి చేయిస్తామని హామీ ఇచ్చి రైతుల ఆందోళన విరమింపజేశారు.



రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

శ్రీమేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన

పరకాల : పట్టణంలోని సుప్రసిద్ధ శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో తెలంగాణలోనే తొలిసారిగా 14 ఫీట్ల ఎత్తుతో శ్రీమేధా దక్షిణామూర్తి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. శైవాగమ పండితులు బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ ఆచార్యత్వంలో ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వేడుకగా చేపట్టారు. ప్రత్యేక పూజలు అనంతరం విగ్రహదాతలు గందె జగత్ లక్ష్మీ-సదానందం కుటుంబ సభ్యులు హోమం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, సిటిజన్ ఫోరం కన్వీనర్ డాక్టర్ ఎస్.విద్యాసాగర్, కౌన్సిలర్లు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, విగ్రహ దాతలు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శాయంపేట : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

శాయంపేట : మండల కేంద్రంలోని నవోదయ హైస్కూల్‌లో 2002-03 బ్యాచ్‌లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం నాడు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులైన సూర్యప్రకాశ్, రామ్మూర్తి, కోటేశ్వర్, వేణు, మామిడి రమేష్ హాజరై నాటి విద్యార్థులను ఆశీర్వదించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సురేందర్, రీనాకర్, ప్రభాకర్, రాజు, రజిని, త్రివేణి, లావణ్య, శిరీష, వంశీ, నాగరాజు, త్రిశూల్, కిరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో..

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2003-04 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల క్రితం పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఒకచోట చేరి ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు విద్య నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాటి గురువులైన నర్సయ్య, నర్సయ్య, మనోహర్, పూర్వవిద్యార్థులు రవి, సతీష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



ఐనవోలులో..

కరాటేతో ఆత్మరక్షణ

హన్మకొండ: ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.మథ్యాస్ రెడ్డి, ఓరుగల్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.శ్రీధర్‌రావు అన్నారు. హనుమకొండ హౌసింగ్ బోర్డుకాలనీలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్లు, రెఫరీలు, జడ్జీల ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సెమినార్ ఆదివారం జరిగింది. జి.మథాస్‌రెడ్డి, పి.శ్రీధర్ జ్యోతిప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కరాటేతో ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. కరాటే శారీరక, మానసిక వికాసానికి దోహద పడుతుందని తెలిపారు.తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ కరాటే రెఫరీ కమిషన్ చైర్మన్ కియోషి, ఎమ్.డి.జహంగీర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఉన్న కరాటే నియమ నిబంధనలు, కరాటేలో ఉన్న మెలకువలను నేర్పించి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సెయింట్ పీటర్స్ స్కూల్ చైర్మన్ గోపు జోజిరెడ్డి, డైరెక్టర్ గోపు సునీతారెడ్డి, సీనియర్ కరాటే మాస్టర్లు ఐ.రామ్మోహన్, ఎండీ.సలీం, ఎస్.భరత్, ఎండీ.అన్వర్, బి.సంతోష్, హనుమకొండ బార్ అసోసియేషన్ ఈసీ మెంబర్లు బి.అనిల్, ఎస్.రమేష్, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

వడగళ్ల వాన, ఈదురుగాలుల బీభత్సం

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక, తహరాపూర్, హుస్సేన్‌పల్లి, పత్తిపాక గ్రామాల్లో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసి బీభత్సం సృష్టించింది. గంటపాటు ఏకధాటిగా కురిసిన వడగండ్ల వాన, ఈదురుగాలులతో పెద్దకోడెపాక గ్రామంలో సుమారు 18 ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. చెట్లు మీద పడడంతో వాహనాలు దెబ్బతిన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరకాల-పెద్దకోడెపాక రహదారిపై గాలివాన కారణంగా రోడ్డుపై చెట్టు అడ్డంగా పడడంతో జోగంపల్లి, కొప్పుల, మైలారం వెళ్లే ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆయా గ్రామాల సర్పంచ్‌లు రోడ్లపై పడిన చెట్లను తొలగింపజేశారు. సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి గ్రామంలోని దెబ్బతిన్న ఇళ్ల యజమానులను కలిసి మాట్లాడారు. ఓదార్చారు. నష్టాన్ని ప్రభుత్వ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆదుకునే ప్రయత్నం చేస్తామని భరోసా ఇచ్చారు.



శిథిలమైన ఇల్లు



పెద్దకోడెపాకలో బాధితులతో మాట్లాడుతున్న సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి